

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



## అనుకోకుండా ఒక రోజు...(పిల్లలతో)

ఆఫీసుకి బయల్దేరుతూ హడావిడిగా లాండ్రీ రూములో సాక్సులు వెతుక్కుంటున్నాను. అక్కడ పేరుకుపోయిన బట్టల గుట్టల్లోంచి ఓ సాక్సు పీకాను. నల్లది వచ్చింది. మరోటి పీకాను. ఈ సారి ఎఱ్ఱది వచ్చింది. ఆనక నీలంది. ఇలా, తీసేకొద్దీ ఇంద్రధనసులోని రంగులన్నీ వస్తున్నాయి తప్ప, ఒకే రకంవి రెండు మాత్రం రాలేదు ఎంత పీకినా. ఇంక నావల్ల కాలేదు. ఫైనల్ గా ఎందం పాదానికి నలుపు సాక్సు, కుడి పాదానికి నీలం సాక్సు వేసేద్దమని డిసైడైపోయాను. తొడిగేసాను..

***"ఆ, అయినా మన పేంటు ఎత్తి ఎవడు చూత్తాడూ?"*** అనుకుంటూండగానే,

***"ఏంటండీ, గుడి బయట అడుక్కునేవాళ్ళ లాగ ఆ కాంబినేషనేవిటీ? కొత్త స్టైలా? ఈ సారి పేంటు కూడా ఎడం గొట్టం నల్లదీ, కుడి గొట్టం నీలందీ కుట్టించుకోండి, వాళ్ళ పక్కన సర్గిగా సరిపోతారు "*** అంది మా శాల్తీ నవ్వుతూ.

***"నీ పోలికకి నిప్పెట్టా. చూసేసావా? ఏదో ఒకటి వేసాను, సంతోషించు"*** అని బూట్లు తొడుగుతూంటే, అప్పుడు చెప్పింది.

**"మీకో శుభవార్త"** అని.

నాకు డౌటొచ్చి ***"నాకేపాపమూ తెలీదు. కావలిస్తే డీ.ఎన్.ఏ టెస్టుకి కూడా రెడీ"*** అన్నాను భయం భయంగా.

***"మీకెంత సేపూ అదే రంధి. నేంచెప్పేది అది కాదు. ఇవాళ మీరు ఆఫీసుకి వెళ్ళట్లేదు, ఇంటినించే పని చేస్తున్నారన్నమాట"*** అంది నవ్వుతూ.

నాకు హాచ్చెర్యంవేసి ***"ఎంద చేట?"*** అన్నాను మెల్లిగా.

***"ఇవాళ టీచర్స్ వర్కిండే. పిల్లలకి సెలవు. నాకేమో టౌన్ హాల్ మీటింగ్. కాబట్టి మీరు పిల్లల్ని చూచింగు, ఇంట్లో స్టేయింగు.."*** అంది గబగబా.

నేను మూతి ముద్దమందారంలా పెట్టి ***"నేనొప్పుకోను. అయినా టీచర్స్ వర్కే ఏవిటి? ఇవాళ తప్ప మిగిలిన రోజుల్లో టీచర్స్ పనిచెయ్యరా?"*** అన్నాను బెంగగా.

***"మీ దిక్కుమాలిన డౌట్లకిప్పుడు టైము లేదు. మీరు ఇంట్లోంచి పని చేసుకోండి, ఆ పెద్ద దెయ్యాన్ని లేపి, పళ్ళు తోమి, కాస్త కూలేయ్యండి. రేపు దాని ప్రాజెక్టు సబ్మిట్ చెయ్యాలి, అది కాస్త చూడండి. ఆ పిల్ల రాక్షసుడికి ఎలాగో అలా మధ్యాన్నం టీవీ చూపిస్తూ రెండు ముద్దలు కూరండి. నేను త్వరగానే వచ్చేస్తాను"*** అనేసి, నేను ఔననీ, కాదనీ, కుదరదనీ, ఇల్లాగైతే ఎల్లాగనీ, అనే లోగానే కారెక్కి జంపైపోయింది.

అలా నిర్దాక్షిణ్యంగా నన్ను దెయ్యానికీ, రాక్షసుడికీ అప్పగించి వెళిపోతున్న కారు కేసి చూస్తూ "నాలుగు చెక్రాలు రెండైనాయి, రెండు దెయ్యాలు ఒకటైనాయి.." అని పాడుకుంటున్న నాకు నా కుడికాలు బరువెక్కినట్టనిపించింది. చూసే సరికి పిల్ల రాక్షసుడు ఆకాలు పట్టుకుని స్థంభం ఆట ఆడుతూ ఊగుతున్నాడు. సరే, తలుపేసి లోపలికొచ్చాను. లెఖ్ఖ తక్కువైనట్టనిపించి మళ్ళీ కాలు కేసి చూసాను. రాక్షసుడు కనపడ లేదు. ఒక్క సారి గుండె జారింది. ***"ఏడి వీడు?"*** అనుకుంటూ తలుపు తీసి చూసాను. అప్పటికే రాక్షసుడు మెయిల్ బాక్సు తెరిచి, అందులో వాడి తల పడుతుందో లేదోనని పరిశోధన చేస్తున్నాడు, వేరే వేరే ఏంగిల్స్ లో తల దూరుస్తూ. అధాట్టున వెళ్ళి వాణ్ణి లోపలకి లాక్కొచ్చి తలుపేసాను. అమాంతం ***వాడు "ఎమ్మే....ఖా..ళీ..." (మానవుల భాషలో "అమ్మ కావాలీ")*** అని అరుస్తూ ఏడవడం మొదలెట్టాడు. వాణ్ణి సోఫాలో కూలేసి, వాడికి నచ్చిన కుక్కల సినిమా ఒకటి టీ.వీ లో పెట్టేసాను.

***"ఒసేయ్ దెయ్యం, ఒసేయ్ దెయ్యం"*** అని గెట్టిగా పిలిచాను.

***"అమ్మ ఆఫీసుకెళ్ళింది నాన్నా"*** అంది మా దెయ్యం పైనించి.

***"ఏడిశావు. నేను నీ గురించి పిలుస్తోంట. పళ్ళన్నీ పీచుపెట్టి శ్రధ్ధగా తోమి రూంలో కూర్చుని ప్రాజెక్టు పూర్తిచెయ్యి..."*** అని ఆర్డరేసేసి కంప్యూటర్ ఆన్ చేసాను.

అప్పటికే కొంపలంటుకుపోయే ఒక స్టేటస్ మీటింగ్ మొదలై, వాళ్ళంతా "**మిష్టర్ దుక్కా, మిష్టర్ దుక్కా**" అని కలవరిస్తున్నారు. హెడ్ సెట్ తగిలించుకుని, ***"వచ్చేస్తున్నా, అంటే వచ్చేసా"*** అనుకుంటూ, మీటింగ్ లో దూరాను మైక్ ఆన్ చేసి.

ఇంతలో రాక్షసుడు "**కుక్క, కుక్క, భౌ భౌ** " అంటున్నాడు. నాకు చిర్రెత్తి ***"రేయ్ కుక్కా, స్టాప్ ఇట్."*** అన్నాను.

సరిగ్గా మా బాసు మాట్లాడే టైములో. అందరూ ***"వాట్,", "హూ"*** అంటూ నసుగుతున్నారు.

నేను వెంటనే సర్దుకుని ***"హూ ఎవెర్ ఈజ్ నాట్ టాకింగ్, ప్లీజ్ మ్యూట్ యువర్ ఫోన్. నో పెర్సనల్ డీటెయిల్స్"*** అన్నాను నవ్వుతూ. అందరూ నవ్వేసి మైకులు ఆపేసారు, ఎందుకేనా మంచిదని. ఇంతలో మా రాక్షసుడు వచ్చాడు. "ఏవిటి" అన్నట్టు తల తిప్పి చూసాను.

వాడు చేతులుకట్టుకుని అడిగాడు ***"నాన్నా, కెన్ ఐ కిల్ అక్కా"*** అని జాలిగా. నాకు మొదట అర్ధం కాలేదు.

***"ఇప్పుడు కాదు నాన్నా, భోజనం చేసాకా చూద్దాం, సరేనా, వెళ్ళి టీవీ చూసుకో.."*** అన్నాను. వాడు ***"ఓ, ఓకే"*** అని వెళిపోయాడు. వాడు వెళ్ళాకా నాకు వెలిగింది. ***"హన్న రాక్షసుడా.."*** అనుకున్నాను. వాడింకో పది నిముషాలు పోయాకా మళ్ళీ వచ్చాడు.

***"నాన్నా, నౌ కెన్ ఐ కిల్ అక్కా?"*** అనుకుంటూ.

***"నో"*** అన్నాను గెట్టిగా.

వాడు నాకేసి దీనంగా చూసి ***"కెన్ ఐ ప్లీజ్ కిల్ అక్కా"*** అన్నాడు మర్యాదగా.

***"ఒరేయ్ బ్రహ్మ రాక్షసుడా. నీ మర్యాద మంటల్లో కలవ, నువ్వు "ప్లీజ్"*** అంటే ఒప్పేసుకుంటాననుకున్నావా? నో ఈస్ ఎ నో" అన్నాను గెట్టిగా.

***"బట్ వై.."*** అన్నాడు వాడు కాళ్ళు కొట్టుకుంటూ.

***"వై ఏవిట్రా, చచ్చు కన్నాం పిల్లని, తప్పమ్మా, అలా అక్కల్ని చంపేసుకో కూడదు, సరేనా, నువ్వెళ్ళి ఆడుకో.."*** అన్నాను వాడికి అర్ధం అయ్యేలా చెప్పే ఓపిక లేక.

వాడు నిర్లిప్తంగా ఓ చూపు చూసి, ***"ఓ, ఓకే, బట్ షి విల్ కిల్ మి ఎట్ ట్వెల్వో క్లాక్, షి టోల్డ్ మి.."*** అన్నాడు మెల్లిగా.

నాకు కాఫీ ముక్కులోకొచ్చింది. ***"ఏవిటీ? నువ్వెళ్ళి దాన్ని రమ్మను. ఒసేయ్ దెయ్యమా, కిందికిరావే.."*** అని అరిచాను.

దెయ్యం ప్రత్యక్షమైంది. రెండు జెడల్లోనూ ఒకటి ఊడిపోయి, ఒకజెడ ముందుకీ, ఒకటి వెనక్కీ వేసుకుని, చెవిలో పెన్సిలు పెట్టుకుని, మూడు గోళ్ళకి రంగు పావుతోన్న మూడోక్లాసు దెయ్యం. ***"ఏవే, నువ్వు తమ్ముణ్ణి ఛంపేస్తానన్నావా?" అడిగాను కోపంగా.***

***"అవును నాన్నా. థాంక్స్ ఫర్ రిమైండింగ్, సరిగ్గా పన్నెండింటికి పీక పిసికేస్తాను.."*** అంది మామూలుగా.

***"వాడేం చేసాడే.."*** అన్నాను బేలగా.

***"నా ప్రాజెక్టు అంతా చింపేసాడు. నా స్కెచ్ పెన్నులతో మీరూము వాల్స్ మీద అంతా బొమ్మలేసే సాడు. కావలిస్తే పైకెళ్ళి చూడు.."*** అంది కోపంగా.

నేను పైకెళ్ళి చూసాను. మారూము గోడల మీద అన్నీ గీతలు. పికాసో గీతలైనా అర్థం అవుతాయిగాని మా రాక్షసుడి ఆర్ట్ ఊహలకందకుండా ఉంది. ఒక రెక్టాంగిల్ వేసాడు. దానికి తోక పెట్టాడు. దాని పైన ఇంగ్లీషులో నాన్న అని రాసాడు. లోపల కుక్క అని రాసాడు. ఏది ముందు రాసాడో అడుగుదామనుకున్నాను కానీ ఓపిక లేక ఊరుకున్నాను. ఇంకో గోడ మీద పది అంకె వేసాడు. ఒకటికి బాణం పెట్టి అమ్మ అని, సున్నకి బాణం పెట్టి నాన్న అనీ రాసాడు. వాడి ఉద్దేశ్యం అర్థం చేసుని తట్టుకునే శక్తి లేక అవతలిగోడవైపు చూసాను. అక్కడ వాడు ప్లస్ ఆకారంలో సూర్యుణ్ణి, ఎఫ్ ఆకారంలో చంద్రుణ్ణీ నేల మీద వేసి, ఆకాశంలో ఎగిరే మనుషుల్ని లావుంది, వేసాడు. ఇంకనాకు పరిపూర్ణమైన వైరాగ్యం కలిగింది. మెల్లిగా వెళ్ళి ఒక అష్టోత్తరం చదివి, వాడి చేతిలోని పెన్నులన్నీ మర్యాదపూర్వకంగా లాక్కుని, వాడికి నా సెల్ ఫోనిచ్చి,

***"గేములు ఆడుకో, ఇంకెప్పుడూ ఇలా, ఇలాంటి బొమ్మలు వెయ్యకు"*** అని బతిమాలి మంచం మీద కూచోబెట్టాను.

***"నారూములోకి పద"*** అంది దెయ్యం, కోపంగా.

ఇంకేం చూడాల్సి వస్తుందోరా భగవంతుడా అని దాని రూములోకెళ్ళాను.. అక్కడ దానీ పుస్తకాలన్నీ చెల్లా చెదురుగా పడేసి వున్నాయి. దాని ప్రాజెక్టు తాలూకు వస్తువులు, పాలడబ్బా డొక్కులు, చీపురు పుల్లలూ, స్ట్రాలు, అట్ట ముక్కలూ అన్నీ చింపేసి, విరక్కొట్టి, ఉత్తర గోగ్రహణం యుద్ధం లో పడిపోయిన కౌరవుల్లా వున్నాయి.

***"చూడు, రేపే ప్రాజెక్టు డెడ్ లైన్. ఇప్పుడు మళ్ళీ చెయ్యాలి. మొత్తం డిస్ట్రాయ్ చేసేసాడు."*** అంది దీనంగా.

***"పర్లేదులేరా. మనం మళ్ళీ చేద్దాంలే. ఏంప్రాజెక్టు?"*** అని అడిగాను అనునయంగా.

***"రీ సైకిల్ ప్రాజెక్టు. వేస్ట్ మెటీరియల్ ని రీ యూజ్ చేసే ప్రాజెక్టు చెయ్యాలి."*** అంది.

***"ఓస్, ఇంతేకదా. పద. నేను పది నిమిషాల్లో చేసిస్తా"*** అన్నాను.

దానికళ్ళలో ఎంతో ఆరాధనా భావం, చూసి ముచ్చటేసింది.

కిందకొచ్చిన పది నిమిషాల్లో పైనించి ***అరిచింది "నాన్నా, కంప్లీట్ అయిందా ప్రాజెక్టు" అని.***

నాకు గుండె నోట్లోకొచ్చింది. జీవితంలో ఎప్పుడూ ప్రాజెక్టు చేసి ఎరగము. ఎలాగరా భగవంతుడా అనుకుని,

***"వేస్ట్ మెటీరియల్ ప్రాజెక్టే కదా, ట్రై చేద్దాం, అన్నిటికీ అధైర్యపడకూడదు"*** అనుకుని మొదలెట్టా.

మా ఇంట్లో ఎక్కడ చూసినా ప్రతీదీ చెత్తలాగే కనిపించింది. ముందుగా ఒక అరటి పండు తొక్క తీసుకుని దాన్ని కార్డు బోర్డుకి అంటించాను. ఈ తొక్క పారెయ్యకండా, ఎప్పుడేనా మనం జూకి వెళ్ళినప్పుడు కోతికి ఇవ్వచ్చు అని ఇంగ్లీష్లో రాసాను కింద. తరవాత మెయిల్ లో వచ్చిన పిజ్జా కూపన్ ని అతికించి, ఈ కూపన్ డెలివరీ బాయ్ కి చూపించకుండా, వాడికి రూపాయి టిప్పిచ్చేసి, మళ్ళీ నెక్స్ట్ టైము రీ యూజ్ చెయ్యచ్చు అని రాసాను. అలాగే కోరేసిన కొబ్బరి డొప్ప తగిలించి, దీనిలో పెన్నులు పెట్టుకోవచ్చు అని రాసాను. ఇలా అద్భుతమైన ఆవిష్కరణలు ఓ పది చేసి, ఎవరికీ కనబడకుండా అ కార్డుబోర్డు, కలర్ పేపర్ తో కవర్ చేసేసి మాపిల్లకి ఇచ్చేసాను.

*"ఏం చేసావు నాన్నా"* అని అడిగింది పిల్ల.

*"సర్ ప్రైజ్ అన్నమాట. రేపు నీకు వందకి నూట యాభై మార్కులిస్తుంది మీ టీచరు"* అనేసాను.

అది ఆనందంగా ఆ దిక్కుమాలిన ప్రాజెక్టుని పైకి పట్టుకుపోయింది.

ఇంతలో బెల్లు మోగింది. మా ఆవిడ వచ్చేసిందనే వెట్టి భ్రమలో తలుపు తీసాను.

పోలీసాఫీసరు. *"మీ ఇంటి నించి గత నలభై నిముషాలుగా 911 కాల్స్ వస్తున్నాయి. మేం చెక్ చెయ్యాలి"* అని ఉవాచ.

అప్పుడు అర్థమైంది, రాక్షసుడికి ఫోనిచ్చి పొరపాటు చేసానని.

నేను ఏదో చెప్పేలోపులో *"ప్లీజ్ స్టెప్ ఎసైడ్"* అని ఆఫీసరు పైకి వెళ్ళాడు.

అక్కడ ఏం జరిగిందో ఏమో గానీ, ఆ పోలీసాఫీసరు సరిగ్గా రెండు నిమిషాలలో కిందకొచ్చి నన్ను కావలించుకుని బావురుమన్నాడు. వాణ్ణి సముదాయించి విషయం అడిగాను. సారాంశం ఇది. నా కొడుకే కాల్ చేసాట్ట. ఆ పోలీసాణ్ణి పట్టుకుని, ప్లీజ్ ఒక్క సారి నీ గన్ను ఇవ్వవా, మా అక్కని చంపేసి, వెంటనే నీకిచ్చేస్తాను అన్నాట్ట. లేపోతే పన్నెండింటికి మా అక్క నన్ను ఛంపేస్తుందని చెప్పాట్ట. ఇంకా ఆ పోలీసాడికి తన ఆర్ట్ వర్క్ అంతా చూపించి, అన్నీ వివరించాడట. దాంతో ఆ పోలీసాడు చలించిపోయి, హృదయం ద్రవించిపోయి, కిందకొచ్చి నా భుజం ఆసరాగా ఎక్కెక్కి ఏడ్చాడు. వాణ్ణి ఊరుకోపెట్టి, వాడికి టీ చేసి ఇచ్చి, వాణ్ణి పంపేసి, నిమిషాలు లెక్కెట్టుకుంటూ కూర్చున్నాను.

ఇంతలో మా ఆఫీసువాళ్ళు నాకోసం ఎమర్జెన్సీ లీవు వాళ్ళే పెట్టేసి, ఆ విషయం ఈ మెయిలు ద్వారా తెలియ చేసారు. కొన్ని యుగాల తరవాత మా ఆవిడ వచ్చింది. నేను అర్జంటు పనుందని బైటికొచ్చి ఆరు గంటలైంది. నేను పూర్తిగా తేరుకున్నాక ఇంటికి వెడదామని ఆలోచిస్తున్నాను. ఇంతలో నా ఫోనులో ఏదో టెక్స్ట్ వచ్చింది మా పిల్ల టీచరు నించి. మా పిల్ల ఉత్సాహం ఆగక, నే చుట్టిన కవర్ ఇప్పేసి, దాని ప్రాజెక్ట్ ఫొటో తీసి వాళ్ళ టీచర్ కి పంపిందట ఫోనులో. ఆవిడ కళ్ళూ మొహం తిరిగి పడిపోయి, ఆనక హాస్పిటల్లో జాయినై, అక్కడినించి నాకు కొట్టిన టెక్స్ట్ సారాంశం

*" డియర్ దుక్కా, దయచేసి మరెప్పుడూ పిల్లకి హెల్ప్ చెయ్యకు. ఇంక నేను బతికున్నంత వరకూ మీ పిల్లకి ప్రాజెక్ట్ ఎసైన్మెంట్లు ఇవ్వను. నేను తేరుకోవడానికి మరో నెల పట్టచ్చు. ఈ లోగా సబ్స్టిట్యూట్ టీచర్ చదువు చెబుతుంది పిల్లలకి. అది నాలా ధైర్యం వున్నది కాదు. కాబట్టి దయచేసి ప్రాజెక్టుల్లో హెల్ప్ చెయ్యడం మానేసేయ్, నీకు పుణ్యం వుంటుంది.."*

సరే, అంతల్లా అడిగితే కాదనలేక, మానవతా దృక్పధంతో నేనూ ఓ నిర్ణయానికొచ్చేసాను. ఇంట్లో వీక్ డేస్ లో - ఉంటే పిల్లలూ, లేడీసన్నా వుండాలి, - లేదా నేనన్నా వుండాలనీ,రాక్షసుణ్ణి ప్రీ స్కూల్ లో వేసేయాలనీ, పిల్లలకి చదువుల్లో ఏ హెల్పూ చెయ్యకూడదనీని..

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS